యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

అల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. తులసినగర్ కాలనీలో రూ.30 లక్షల నిధులతో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. వర్షపు నీరు రోడ్డుపై నిల్వకుండా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, సీహెచ్. భాస్కర్, యాదగిరి, సంగమేష్, మల్లేష్ గౌడ్, రమేష్, నవీన్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించారు

- సాక్షి కథనంతో స్పందించిన అధికారులు
- పార్కు పరిసరాలు శుభ్రం చేసిన కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

మోతీనగర్: 'పార్కు చుట్టూ చెత్తా చెదారం' అనే శీర్షికతో కూకట్‌పల్లి 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్ లైబ్రరీ పార్కు ప్రహరీ చుట్టూ కొన్ని రోజుల నుంచి చెత్తా చెదారం, మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, చెట్ల కొమ్మలు పేరుకుపోవడంతో దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో వాకింగ్ వచ్చే వారు దుర్వాసనతో సతమతమవుతున్నారు. ఈ విషయమై 'సాక్షి' దిన పత్రికలో ప్రచురించగా.. మూసాపేట సర్కిల్ అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్ ఏరియా జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు పార్కు చుట్టూ ఉన్న చెత్తను తొలగించారు. బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. దీంతో స్థానికులు 'సాక్షి'కి, పారిశుధ్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.


పార్కు ప్రహరీ చుట్టూ చెత్తా చెదారం (నాడు)


చెత్తా చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లిన ప్రాంతం (నేడు)

ప్రొఫెసర్ లక్ష్మణ్‌రావు పదవీ విరమణ


ప్రొఫెసర్ లక్ష్మణ్‌రావును సన్మానిస్తున్న ప్రొఫెసర్‌లు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ కె.ఎల్. లక్ష్మణ్‌రావు పదవీ విరమణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన గౌరవార్థం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా యూనివర్సిటీ రెక్టార్ డా. కె. విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ లక్ష్మణ్‌రావు రాష్ట్రంలోని పలు రోడ్డు నిర్మాణాలు, ప్రాజెక్టులకు సలహాదారుడిగా ఉన్నారని తెలిపారు. ముఖ్య ఉపన్యాసకుడిగా ఐఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దిగ్విజయ్ పాల్గొన్నారు. లక్ష్మణ్‌రావు 32 సంవత్సరాలు ఆచార్య వృత్తిలో ఉన్నారని తెలిపారు. పదవీ విరమణ సందర్భంగా ఆయనను ఇతర ప్రొఫెసర్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. పద్మావతి, సివిల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ డీన్‌కుమార్, డాక్టర్ జి.కె. విశ్వనాథం, డాక్టర్ ఎం. జనార్దన్ యాదవ్, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ జీవీఎస్ గిరిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు


డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సభ్యులు


నిజాంపేట్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన యంగ్‌స్టార్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ శుక్రవారం డిప్యూటీ మేయర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనాలతో పాటు తొట్టెల ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

నియామకం


కేశవ్ యాదవ్

జీడిమెట్ల: మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యదర్శిగా న్యాయవాది కేశవ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యత ఉంటుందన్నారు. తనలాంటి సాధారణ కార్యకర్తని జిల్లా కార్యదర్శిగా నియమించడం ఆనందంగా ఉందని ఈ స్థాయికి చేరుకునేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలని కేశవ్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్ రెడ్డి చెంది శ్రీనివాస్, పత్తి రఘుపతి, డివిజన్ అధ్యక్షుడు పులి బలరాం, పత్తి సతీశ్, సాయినాథ్ నేత, పరుష వేణు, దుర్యోధన రావు తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ సైనికులకు ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా యూనివర్సిటీలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలను అర్పించిన సైనికులకు నివాళులర్పించారు. యుద్ధంలో మన దేశ సైనికులు చూపించిన ధైర్యం, త్యాగం యావత్ భారతదేశానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శివకృష్ణ, సిద్ధార్థ, చంద్రశేఖర్ పటేల్, పవన్ కుమార్, సాయిచరణ్ గౌడ్, స్నేహిత్ కల్యాణ్, ప్రేమ్‌కుమార్, రంజిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా ఆస్తిపన్ను వసూలు

జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్


సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

కూకట్‌పల్లి: ప్రతి రోజు కనీసం ఐదుగురితోనైనా ఆస్తిపన్ను కట్టించాలని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ఆదేశించారు. శుక్రవారం డిప్యూటీ కమిషనర్లు, జోనల్ ఏఎంసీ, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లతో ఆస్తి పన్ను వసూలుపై సమావేశం నిర్వహించారు. ఆస్తి పన్ను వసూళ్లు, వ్యక్తి గత వసూళ్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మదింపు చేయని ఆస్తులను వెరిఫికేషన్ చేయాలన్నారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు ఏఎంసీలో సంబంధిత ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి అందుబాటులో ఉండాలని, లేకుంటే లక్ష్యాన్ని చేరుకోలేరని ఆయన అన్నారు.

గృహజ్యోతి.. అందరికీ అందేలా..!



- ఎంపీడీఓ, పురపాలకతో పాటు కలెక్టరేట్‌లో ప్రత్యేక కేంద్రం
- నాడు దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదులో గందరగోళం
- తప్పుల సవరణకు ఎడిట్ ఆప్షన్
- జిల్లాలో మొత్తం రేషన్ (ఆహార భద్రత) కార్డులు 5.23 లక్షలు
- లబ్ధిదారులు 2.24 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు ఉచిత కరెంటు అందించడానికి 'గృహజ్యోతి' పథకం ప్రవేశపెట్టి ఈ ఏడాది మార్చి నుంచి అమలు చేస్తోంది. 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్ వినియోగదారులకు ఉచితంగా విద్యుత్ అందించే ఈ పథకం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అర్హులకు అందని ద్రాక్షగానే మిగులుతోంది. అనేక కారణాలతో జిల్లాలో 50 శాతం మంది గృహజ్యోతి లబ్ధికి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో అర్హులకు పథకం వర్తించేలా ప్రభుత్వం కృషి చేస్తోంది.

నాడు గందరగోళంగా ఆన్‌లైన్ నమోదు...

గతంలో ఇచ్చిన హామీల మేరకు ప్రజాపాలన దరఖాస్తులను జిల్లా వ్యాప్తంగా యంత్రాంగం స్వీకరించింది. అనంతరం వాటిని కంప్యూటరీకరణ ద్వారా ఆన్‌లైన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేశారు. ఈ క్రమంలో ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ తదితర వివరాలను ఆపరేటర్లు సరిగా నమోదు చేయకపోవడం, తప్పులు దొర్లడంతో పథకాలకు చాలా మంది దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవలే కలెక్టరేట్, మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాల్లో జీరో బిల్లులు రాని వారి వివరాలను తిరిగి నమోదు చేసేందుకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారు. అయితే కొత్తగా జీరో బిల్లుల కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించకపోవడంతో ప్రజలు నిరుత్సాహం చెందుతున్నారు.

గృహజ్యోతి పథకం ఇలా...

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రేషన్ (ఆహార భద్రత) కార్డులు 5,23,898 ఉండగా, గృహ విద్యుత్ వినియోగదారులు 15,14,262 మంది ఉన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో గృహజ్యోతి పథకానికి దాదాపు 5.50 లక్షల దరఖాస్తు వచ్చాయి. ఇందులో 2,24,874 మంది మాత్రమే లబ్ధి పొందుతున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ప్రతి నెల రూ. 8.97 కోట్ల సబ్సిడీ అందజేస్తోంది.

సవరణలకు ప్రత్యేక కేంద్రాలు...

గృహజ్యోతి పథకం అందని లబ్ధిదారులకు ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించింది. దరఖాస్తుల్లో పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా మందికి జీరో బిల్లులు (ఉచిత గృహ విద్యుత్ పథకం) రావడం లేదు. కొందరికి ఆహార భద్రత కార్డు లేకపోవటం, మరికొందరికి సరైన పత్రాలు లేకపోవటం, ఇంటి నంబర్లు, సర్వీసు నంబర్లు తప్పుగా నమోదు చేయటం, ఎక్కువ కనెక్షన్లు ఉండటం తదితర కారణాలతో పథకం వర్తించని పరిస్థితి నెలకొంది. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో బాధ్యుల వద్ద పొరపాట్లను సరిచేసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలోనే ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ఎడిట్ ఆప్షన్‌కు అవకాశం కల్పిస్తోంది.

కలెక్టరేట్‌లోనూ ప్రజాపాలన సేవా కేంద్రం...

ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీల్లో భాగంగా సవరణలు, దరఖాస్తులకు కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పథకాలు అందని వారు ఆందోళన చెందకుండా సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగం కోరుతోంది.

రేపు నల్లపోచమ్మ బోనాలు

మోతీనగర్: అవంతి నగర్ (తోట) కాలనీ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బోనాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు మైల బోనం సమర్పించే కార్యక్రమంతో పూజలు ప్రారంభమవుతాయని, కాలనీ వాసులు కుటుంబ సమేతంగా నల్లపోచమ్మ అమ్మవారి దేవాలయం వద్ద జరిగే పూజలో పాల్గొనాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మోతీనగర్: గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అల్లాపూర్ సీఐ వివరాల ప్రకారం.. అల్లాపూర్‌లోని గాంధీ విగ్రహం సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుంది. రెడ్ కలర్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడు. మద్యం సేవించి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు మృత దేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి వివిధ కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ట్యాక్స్‌పై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలి


కంపెనీల చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ల సమావేశంలో పాల్గొన్న అతిథులు


రాయదుర్గం: ట్యాక్స్‌కు సంబంధించిన అంశాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఫాస్ట్ బిజినెస్ కన్సల్టింగ్ సీఈఓ, ఆర్థిక నిపుణుడు మిథిలేష్ సాయిసన్నా రెడ్డి సూచించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో శుక్రవారం ప్రముఖ కంపెనీల చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సీఏలు ట్యాక్స్‌కు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవడం ద్వారా తమ క్లయింట్లకు సరైన సేవలు అందించగలుగుతారన్నారు.

భారత క్రీడాకారులకు 'మనూ' శుభాకాంక్షలు

రాయదుర్గం: పారిస్ ఒలంపిక్స్-24లో భారత్ భారీగా పతకాలను సాధించాలని మనూ వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్ ఆకాంక్షించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం వద్ద భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలుపుతూ బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీఎస్‌సీ చైర్మన్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఏ కలీముల్లా, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ జే రాజేష్, డాక్టర్ మహ్మద్ హబీబుల్లా, అసిస్టెంట్ ఇంజనీర్ ఎంఏ హఫీజ్ పాల్గొన్నారు.

నాలా నుంచి ఘాటు వాసన

- రసాయనాలతో కళ్ల మంటలు, తలనొప్పి
- అధికారులకు ఫోన్ చేసినా స్పందన కరువు


రసాయన ఘాటు వాసనలు వస్తున్న నాలా

బాలానగర్: బాలానగర్ డివిజన్‌లోని శ్రీ కల్యాణీనగర్, సాయినగర్ కాలనీ వాసులు రసాయనాల ఘాటు వాసనలు, కళ్ల మంటలతో ఇబ్బంది పడ్డారు. తెల్లవారుజామున సుమారు 3 గంటల నుంచి ఘాటు వాసనలు రావడంతో పలువురు కళ్ల మంటలు, తలనొప్పితో ఇబ్బంది పడ్డారు. కాలనీ పక్కన ప్రవహించే నాలా నుంచి ఘాటు వాసనలు వస్తున్నాయని పలువురు పొల్యూషన్ బోర్డు అధికారులకు ఫోన్ చేయగా.. ఎవ్వరూ స్పందించలేదని స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. 'నాలా నీటిని తీసుకొచ్చి మాకు ఇస్తే మేమే పరీక్ష చేస్తామని, ఊరికే ఫోన్ చేసి విసిగించవద్దని' ఒక అధికారి విసుగ్గా సమాధానం ఇచ్చారని కాలనీవాసి తెలిపారు. ఇకనైనా సంబంధిత ఉన్నత శాఖ అధికారులు స్పందించి నాలాలో రసాయనాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

తపాలా సేవలను వినియోగించుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: కేంద్ర తపాలా సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన డీసీడీపీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తపాలా సంస్థ అందిస్తున్న జీవిత బీమా, ప్రమాద బీమా తదితర సేవలను వివరించారు. కార్యక్రమంలో పోస్టల్ అధికారులు శ్రీనివాసరావు, గోవిందరాజ్, డివిజన్ అధ్యక్షుడు భిక్షపతి, సురేందర్ నాయుడు, శిల్ప, గట్ల శేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

'చిత్తారమ్మ' బోనాలకు ఏర్పాట్లు

- కూకట్‌పల్లి చిత్తారమ్మ ఆలయానికి వందల సంవత్సరాల చరిత్ర
- ఆదివారం భారీ ఎత్తున పూజలు
- ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ



కూకట్‌పల్లి: కుగ్రామంలో వెలిసిన గ్రామ దేవత చిత్తారమ్మ తల్లికి తరతరాలుగా కూకట్‌పల్లి వాసులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. 400 సంవత్సరాల క్రితం ఆనాడు గ్రామంలో వచ్చిన మశూచితో పాటు భయంకరమైన వ్యాధులు ప్రబలి ఎంతోమంది పిల్లలు రోగాల భారిన పడ్డారు. అప్పటి కుక్కటేశ్వర పురం శివారులో వెలిసిన చిత్తారమ్మ తల్లికి గ్రామస్తులు పూజలు చేసి, కల్లు సాక పోసి మూగజీవాలను బలి ఇవ్వటంతో వచ్చిన వ్యాధులన్నీ తగ్గాయని పెద్దలు పేర్కొన్నారు. నాటి నుంచి తరతరాలుగా కూకట్‌పల్లి వాసులు ఈ అమ్మవారిని గ్రామ దేవతగా కొలుచుకుంటూ ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం 4వ ఆదివారం నాడు భారీ ఎత్తున పూజలు నిర్వహిస్తారు. చిన్న గుడిగా ఉన్న ఈ దేవాలయాన్ని గ్రామస్తులు భారీ వ్యయంతో నిర్మాణం చేపట్టి అందరికీ పూజలు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. నాడు ఎడ్లబండ్లతో అమ్మవారి చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. ఇప్పటికి బోనాల నాడు అమ్మవారిని క్రిష్ణమూర్తి పంతులు చెప్పిన ప్రకారం భక్తులు కొలుస్తారు. ఆదివారం బోనాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారు.


విద్యుత్ కాంతులతో చిత్తారమ్మ దేవాలయం

ఫలహారం బండి ఊరేగింపు


ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మూసాపేట: బోనాల పండుగ సందర్భంగా కూకట్‌పల్లి దేవీనగర్‌లో శివాజీ యూత్ అసోసియేషన్, అభిలాష్ గౌడ్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, అరుణ్, అక్షయ్, ప్రశాంత్, నవీన్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న జేసీబీ

దుండిగల్: ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలపై దుండిగల్ మున్సిపల్ రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. దుండిగల్ తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది భౌరంపేట్ సర్వే నంబర్ 472లో పలు బేస్‌మెంట్లు, గదులను జేసీబీతో శుక్రవారం కూల్చి వేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను కొనుగోలు చేసి మోసపోవద్దని, ఎవరైనా అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నిజాంపేట్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీకి చెందిన వెంకట్రావు భార్య శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇంటికి తాళం వేసి సూపర్ మార్కెట్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ఇంటికి వచ్చిన వెంకట్రావు భార్యకు ఫోన్‌చేయగా సూపర్ మార్కెట్‌లో ఉన్నానని చెప్పడంతో ఆమెవద్దకు వెళ్లి తాళం తీసుకున్నాడు. ఇంటికి వెళ్లి బీరువా తెరిచి చూడగా అందులోని 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష 20 వేలు కనిపించలేదు. దీంతో ఈ విషయమై భార్యను అడుగగా తాను తీయలేదని సమాధానం చెప్పింది. దీంతో వెంకట్రావు సుమారు 20 తులాల బంగారం మాయమైందని బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇది తెలిసిన వారి పనే అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

పెద్దమ్మ ఆలయ పనుల పరిశీలన

జగద్గిరిగుట్ట: భూదేవి హిల్స్ కాలనీలోని పెద్దమ్మ ఆలయ పనులను స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ శుక్రవారం పరిశీలించారు. ఆదివారం నిర్వహించనున్న బోనాల వేడుకలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు.

ఓరియంటేషన్ డే

కుత్బుల్లాపూర్: చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు శుక్రవారం ఓరియంటేషన్ డేను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి, హైమవతి హాజరై క్రీడో పబ్లిషింగ్ పుస్తకాలు ఆంగ్లం, గణితం, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, లాజికల్ రీజనింగ్ పాఠ్యాంశాలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర అంశాలపై పట్టు సాధించేలా తమ పాఠశాలలో బోధన ఉంటుందని కోటిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ

సుభాష్‌నగర్: నగరంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో బహదూర్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-19 విభాగంలో విద్యార్థులు నందు గోల్డ్ మెడల్, సౌమ్య, సునీల్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. దీంతో శుక్రవారం పాఠశాలలో డీఈవో విజయకుమారి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

వైద్య విద్యలో ఉజ్బెకిస్తాన్‌కు మంచి గుర్తింపు

గచ్చిబౌలి: వైద్య విద్య అందించడంలో ఉజ్బెకిస్తాన్‌కు మంచి గుర్తింపు ఉందని ఆ దేశంలోని టురోన్ జర్మెడ్ యూనివర్సిటీ చైర్మన్ దిల్షాన్ షకూర్ అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంబీబీఎస్ ప్రవేశాల వివరాలను వెల్లడించారు. అపోలో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అనుబంధ సంస్థ అపోలో మేడ్ స్కిల్ లిమిటెడ్‌లో అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీని అందిస్తుందన్నారు. ఉజ్బెకిస్తాన్ యూనివర్సిటీలో నేరుగా ప్రవేశం పొందవచ్చన్నారు. అపోలో మేడ్ స్కిల్ లిమిటెడ్ సీఈఓ శ్రీనివాసరావు పాలిజల, గ్వంటేజ్ గ్రూపు చైర్మన్ గజన్ ఫర్ అలీ పాల్గొన్నారు.